సాక్షి
నంద్యాల
మంగళవారం । 25 । జూలై । 2023



## శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



## కేసీకి నీరు విడుదల

గూడూరు: సుంకేసుల డ్యాం నుంచి సోమవారం కర్నూలు ప్రజలకు తాగునీటి అవసరాల నిమిత్తం 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయంలో 0.845 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



## 'దృష్టి' సారించి..

పేదలల కంటి చూపును కాపాడేందుకు ప్రభుత్వం 'దృష్టి' సారించింది. వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా సీహెచ్‌సీలలో ముఖ్యమంత్రి 'ఐ' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. 8లో

## న్యూస్‌రీల్

### అహోబిలం క్షేత్రంలో డిజిటలైజేషన్



దేవస్థాన అధికారులతో చర్చిస్తున్న మఠం పీఠాధిపతి యతీంద్ర మహాదేశికన్ స్వామిజీ

ఆళ్లగడ్డ: అహోబిలం దేవస్థానాన్ని డిజిటలైజేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అహోబిలం మఠం పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామిజీ పేర్కొన్నారు. దిగువ అహోబిలం మఠంలో సోమవారం అభివృద్ధి కమిటీ అధికారులతో పీఠాధిపతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు పారదర్శకత, జవాబుదారీ కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మూడు విడతలుగా దేవస్థానాన్ని మొత్తం డిజిటలైజేషన్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముందుగా వెబ్‌సైట్ రూపొందించి భక్తులు ఆన్‌లైన్‌లోనే సేవా టిక్కెట్లు, గదులు బుక్ చేసుకోవడం, కార్యాలయ వ్యవహారాలన్నీ ఆన్‌లైన్‌లోనే జరుపుకునేలా, ఎలక్ట్రానిక్ భద్రత వ్యవస్థలను ఏర్పాటు చేసే పనులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీపీఏ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా వ్యాప్తంగా తేలికపాటి వర్షాలు

నంద్యాల(సెంట్రల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో తేలికపాటి వర్షాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు నంద్యాల జిల్లాలోని 22 మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తం మీద సగటున 3.1 మి.మీ వర్షం కురిసింది. నంద్యాల జిల్లా జూలై నెల సాధారణ వర్షపాతం 141.2 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 84.1 మి.మీ వర్షపాతం నమోదైంది. కర్నూలు జిల్లాలోని 16 మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. జిల్లా మొత్తంగా సగటున 2.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 70.7 మి.మీ వర్షపాతం నమోదైంది.

### ఉద్యోగాల పేరుతో మోసపోవద్దు

బొమ్మలసత్రం: ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో ఎక్కువగా ఉద్యోగాల పేరుతో మోసపోయిన బాధితుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి ఎన్నో నిబంధనలు ఉన్నాయని, వాటిలో ప్రతిభ కనబరిచిన వారికే ఉద్యోగాలు వస్తాయన్నారు. ఎవరైనా ఇటువంటి మోసాలకు గురై ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకొని రావాలని ఎస్పీ కోరారు.

### వేధింపుల కేసులో టీచర్ సస్పెన్షన్

కర్నూలు(సిటీ):కల్లూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (రెగ్యులర్)లో ఎస్జీటీ టీచర్‌గా పనిచేస్తున్న జి.గురుస్వామిని వేధింపుల కేసులో సస్పెండ్ చేసినట్లు డీఈఓ రంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓ బాలికను లైంగిక వేధింపులకు గురిచేసినట్లు డీఈఓ వెల్లడించారు. గతంలో కూడా ఇలాంటి వేధింపుల కేసులోనే సదరు ఉపాధ్యాయుడు సస్పెండ్ అయినట్లు ఆయన తెలిపారు.

### ఇద్దరు బిడ్డలను చంపిన తండ్రికి యావజ్జీవం

కర్నూలు(లీగల్)/నందికొట్కూరు: ఇద్దరు బిడ్డలను చంపిన తండ్రికి యావజ్జీవ కారాగారశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ కర్నూలు మొదటి అదనపు జిల్లా జడ్జి ఎ.శ్రీనివాసకుమార్ సోమవారం తీర్పు చెప్పారు. కర్నూలు నగరానికి చెందిన సింధే దనోజీరావు జీవనోపాధి కోసం జూపాడుబంగ్లాకు కుటుంబాన్ని మార్చాడు. తన భార్య ఝాన్సీబాయి చెడు అలవాట్లకు బానిసగా మారి ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని, ఎన్నిసార్లు చెప్పినా తన ప్రవర్తనలో మార్పు రానందున 2018 అక్టోబర్ 8 తెల్లవారుజామున దనోజీరావు తన కుమార్తె నిఖిత (7), కుమారుడు మధుచరణ్ (4)లతో పాటు చనిపోవాలని భావించాడు. తన ఇంటికి దగ్గర్లోని నీటికుంటలో వారిద్దరినీ ముంచి ఊపిరాడకుండా చేసి చంపి ఇద్దరి మృతదేహాలను రేకుల షెడ్డు వద్దకు తెచ్చి తను కూడా చనిపోవాలని కరెంటు వైరుతో ఉరి వేసుకోగా అది తెగిపోయింది. తను చావలేక రోదిస్తుండగా స్థానికులకు విషయం తెలిసి పోలీసులు ధనోజీరావుపై హత్య కేసు నమోదు చేసి అభియోగపత్రాలు దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం ఒప్పుకోవడంతో నిందితుడైన ధనోజీరావుకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ హాజికేల్ వాదించారు.



### మంచి ఆదాయం వస్తోంది

ఈ ఫొటోలోని మహిళ పేరు జుబేదాబీ. కల్లూరు మండలం తడకనపల్లి వాసి. వెజిటబుల్ సోలార్ డ్రైయర్ ప్లాంటు తీసుకున్నారు. రోజూ రెండు క్వింటాళ్ల ఉల్లి ప్రాసెస్ చేస్తున్నారు. కిలోకు రూ.2.50 చొప్పున రోజుకు రూ.500, కరెంటు చార్జీల పేరుతో బస్తాకు రూ.20 చొప్పున మరో రూ.80 ఇస్తారు. ఇలా నెలకు రూ.17,400 వస్తోంది. టమాటాను ఫ్లేక్స్ చేస్తే మరింత వస్తుంది. అంటే ఏడాదికి రూ.2.8 లక్షలు సంపాదిస్తోంది.

### రూపాయి పెట్టుబడి లేకుండా ఆదాయం



ఈమె పేరు సుబాన్‌బీ. కోడుమూరు నియోజకవర్గం గూడూరు వాసి. పొదుపు మహిళ. అధికారులు సోలార్ డ్రైయర్స్ గురించి చెప్పి తడకనపల్లిలో ఏర్పాటుచేసిన ప్లాంటు చూపించారు. వీటిని అధ్యయనం చేసిన ఆమె గత నెల 22న ప్లాంటు ఏర్పాటు చేసింది. ఎస్4ఎస్ కంపెనీ ప్రతినిధులు ఉల్లి సరఫరా చేస్తున్నారు. రోజూ రెండు క్వింటాళ్లు వస్తోంది. ప్లాంటు ఏర్పాటుకు రూ.10వేలు మాత్రమే చెల్లించారు. మిగతా మొత్తం బ్యాంకు రుణం. ఉల్లి, టమాటా కొనుగోలుకు రూపాయి పెట్టుబడి అవసరంలేదు. కంపెనీనే ఇస్తోంది. వారే ఉత్పత్తులు సేకరిస్తారు. మంచి ఆదాయం ఉంది.

# పొదుపు మహిళ ఇంట.. సిరుల పంట

## కర్నూలు జిల్లాలో సోలార్ డ్రైయర్స్‌తో ఉపాధి

మహారాష్ట్ర తర్వాత కర్నూలులోనే వీటి ఏర్పాటు

ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న ఎస్4ఎస్ కంపెనీ

- ఉల్లి, టమాటాను డ్రై చేసి బహుళజాతి కంపెనీలకు ఎగుమతులు
- సగటున ఒక్కో మహిళకు కనిష్టంగా రూ.20వేల ఆదాయం
- వంద యూనిట్లు ఏర్పాటు.. మూణ్నెల్లలో 5వేల యూనిట్ల ఏర్పాటు లక్ష్యం
- ఈ ఏడాది ముగిసేలోపు 10వేల యూనిట్లు లక్ష్యం
- ధరలు పతనమైతే ఉల్లి, టమాటా రైతులు ఆందోళన పడాల్సిన అవసరంలేదు

రాష్ట్రంలో అత్యధికంగా ఉల్లి పండించే జిల్లా కర్నూలు. రాష్ట్రానికి 90 శాతం ఈ పంట కర్నూలు జిల్లా నుంచే సరఫరా అవుతుంది. ధరల్లో ఆటుపోట్లు వచ్చినపుడు రైతులకు నష్టం వాటిల్లకుండా 'సోలార్ డ్రైయర్స్' తోడ్పాటునందిస్తాయి. మామూలు సమయంలో కూడా ఇవి రైతుకు, మహిళలకు ఆర్థికదన్ను ఇస్తున్నాయి. దేశంలో తొలిసారి మహారాష్ట్రలో ఏర్పాటుచేసిన వీటిని రాష్ట్రంలో ఏర్పాటుచేసి రైతుల కన్నీటిని తుడవాలని, మహిళలకు ఆర్థిక చేయూతనివ్వాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. గతనెల జూన్ 1న ఆయన పత్తికొండకు విచ్చేసినపుడు వీలైనన్ని గ్రామాల్లో ప్లాంట్లు ఏర్పాటుచేయాలని కలెక్టర్ సృజనను ఆయన ఆదేశించారు. సీఎం చెప్పిన వెంటనే జూన్‌లోనే ప్రయోగాత్మకంగా వంద యూనిట్లు ఏర్పాటుచేశారు. వీటి ఫలితాలు సంతృప్తికరంగా ఉండటంతో పాటు ఆర్థికంగా దోహదం చేయడంతో మూణ్నెల్లలో ఐదువేల ప్లాంట్లు, డిసెంబర్‌లోపు జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ముఖ్యంగా ఉల్లిసాగు అధికంగా ఉన్న గ్రామాల్లో 10వేల ప్లాంట్లు ఏర్పాటుచేయాలని కలెక్టర్ సృజన లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

- సాక్షి ప్రతినిధి, కర్నూలు

### సబ్సిడీతో 'సోలార్ డ్రైయర్స్'..

పీఎంఎఫ్ఎంఈ (ప్రధానమంత్రి ఫార్ములేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజ్ స్కీం), ఏపీఎఫ్‌పీఎస్ (ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ) కలిసి 'సోలార్ డ్రైయర్స్'ను ఏర్పాటు చేస్తున్నారు. దేశంలో మహారాష్ట్రలో మాత్రమే ఈ ప్లాంట్లు ఉన్నాయి. రెండో రాష్ట్రం ఏపీ మాత్రమే. ఈ ప్లాంటు యూనిట్ ఖర్చు రూ.లక్ష. ఇందులో రూ.10వేలు లబ్ధిదారులు చెల్లించాలి. రూ.90వేలు బ్యాంకు రుణం ఇస్తుంది. ఇందులో రూ.35వేలు సబ్సిడీ ఉంటుంది. అంటే ప్లాంటు ఖర్చు కేవలం రూ.65వేలే. సోలార్ డ్రైయర్స్‌తో ఉల్లి, టమాటా ఫ్లేక్స్ చేయొచ్చు. ఇక ప్రస్తుతం ఉల్లిని మహారాష్ట్రకు చెందిన ఎస్4ఎస్ అనే కంపెనీ మహిళలకు సరఫరా చేస్తోంది. తక్కువ ధరకు దొరికే గ్రేడ్–3ని ఉల్లి దీనికి వినియోగిస్తున్నారు. ఉల్లిని శుభ్రంచేసి కటింగ్ మిషన్‌లో వేస్తారు. స్లైస్‌లా పల్చగా కట్ అవుతాయి. 50 కేజీల బస్తా 20 నిమిషాల్లో కట్ అవుతుంది. ఆపై వీటిని ఎఫ్‌బీడీలో వేస్తారు. అందులోని ఫ్యాన్ల సాయంతో 6–8 గంటలు ఉండి 80 శాతం డ్రై అవుతాయి. ఆపై 4–6 గంటలు సోలార్ ప్యానెల్స్‌పై ఉంచుతారు. వందశాతం డ్రై అవుతాయి. వంద కేజీలు ప్రాసెస్ చేస్తే పది కిలోల స్లైస్ వస్తాయి. వీటిని ఎస్4ఎస్ సంస్థే కొనుగోలు చేస్తుంది. వీటి నిల్వకు ప్లాంటు ఉన్న ప్రతీ గ్రామంలో చిన్న గోడౌన్ ఏర్పాటుచేశారు. రవాణా, ఇతర ఖర్చులు కంపెనీనే భరిస్తుంది. పది కిలోల స్లైస్‌ను గోరువెచ్చని నీటిలో వేస్తే తిరిగి వంద కిలోల ఉల్లి ముక్కలు వస్తాయి. ఇవి మహారాష్ట్ర నుంచి అరబ్ దేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతాయి.



కర్నూలు జిల్లా తడకనపల్లిలో సోలార్ డ్రైయర్ల ద్వారా ఉల్లి ఫ్లేక్స్ తయారీ



కృష్ణగిరి మండలం లాన్‌మాన్‌పల్లిలోని ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రం

### 100 సోలార్ డ్రైయర్లు.. 11 ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రాలు

- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



విజిటబుల్ సోలార్ డ్రైయర్ల ఏర్పాటుకు కల్లూరు మండలం తడకనపల్లి గ్రామం ప్రత్యేక వేదిక అవుతోంది. ఈ నెల 25న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తడకనపల్లిలో 100 విజిటబుల్ సోలార్ డ్రైయర్లను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అదే విధంగా ఉద్యాన శాఖ జిల్లాలో 11 ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రాలను నిర్మించింది. ఈ కలెక్షన్ సెంటర్లను కూడా ముఖ్యమంత్రి నేడు వర్చువల్ పద్ధతిలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు జిల్లా అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ జి.సృజన, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పాటు పలువురు శాసనసభ్యులు పాల్గొంటారు. తడకనపల్లి మహిళలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులను ఉద్దేశించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లైవ్‌లో ప్రసంగించనున్నారు.

### పదెకరాల రైతు ఆదాయం కంటే ఎక్కువ ఆదాయం..

- రోజూ ఒక ప్లాంటు ద్వారా ఒకరు మూడు క్వింటాళ్లు ప్రాసెస్ చేయొచ్చు. అంటే రోజూ రూ.750 వస్తుంది.
- 50కిలోల బస్తాకు రూ.20 చొప్పున కరెంటు చార్జీలు చెల్లిస్తారు. ఇది మరో రూ.120 వస్తుంది.
- అంటే నెలకు రూ.26,100 సంపాదించొచ్చు.
- ఏడాదికి రూ.3,13,200 ఆదాయం వస్తుంది.
- ఈ ఆదాయం పదెకరాల రైతు ఆదాయం కంటే ఎక్కువే.
- వర్షాలు నిలిచాక రోజూ మూడు క్వింటాళ్లు ప్రాసెస్ చేస్తారు.
- జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ వర్షాకాలం. ఈ సీజన్‌లో రోజుకు రెండు క్వింటాళ్లు చేసుకుంటున్నారు.

### రూ.18 వేలు ఆదాయం వస్తోంది



నా పేరు హజరాబీ. సోలార్ డ్రైయర్ ఏర్పాటు చేసి ప్రాసెస్ చేస్తున్నా. నెలకు రూ.18వేల ఆదాయం వస్తోంది. ఎస్4ఎస్ కంపెనీ వారు ఉల్లి, టమాటా బస్తాలు మాకు ఇస్తున్నారు. మేం ప్రాసెస్ చేసి తిరిగి వారికి ఇస్తున్నాం. సులభంగా ఫ్లేక్స్ తయారు చేయొచ్చు. పని తక్కువ.. ఆదాయం ఎక్కువ. ప్రస్తుతం రోజూ నాలుగు బస్తాలు (రెండు క్వింటాళ్లు) చేస్తున్నా. వర్షాలు తగ్గితే ఆరు బస్తాలు చేయొచ్చు. నెలకు రూ.18 వేలు చొప్పున ఏడాదికి రూ.2.16 లక్షల ఆదాయం వస్తాది. పదెకరాల రైతులకు కూడా ఈ ఆదాయం రాదు. మాకు చాలా సంతోషంగా ఉంది.

### మరిన్ని యూనిట్లు ఏర్పాటుచేస్తాం..



సీఎం చెప్పిన వెంటనే వంద యూనిట్లు ఏర్పాటుచేశాం. మంచి ఫలితాలొచ్చాయి. ఆదాయం బాగుంది. దీంతో పొదుపు మహిళలను ప్రోత్సహించాం. ప్లాంట్లను వీరికి చూపిస్తున్నాం. వీటిపై అవగాహన వచ్చిన తర్వాత వాళ్లు ప్లాంటు ఏర్పాట్లు చేస్తారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో మూణ్నెల్లలో ఐదువేల యూనిట్లు, డిసెంబర్‌లోపు 10వేల యూనిట్లు ఏర్పాటుచేయడమే లక్ష్యం. ప్లాంటు ఖర్చులో 35శాతం సబ్సిడీ ఇస్తున్నాం. దీంతో ఆర్థికంగా కూడా మహిళలపై భారం ఉండదు. కర్నూలు జిల్లాలో ఇది మంచి పరిణామం. మ్యాగీ మసాల, ఇతర ఆహార ఉత్పత్తులు తయారుచేసే బహుళజాతి కంపెనీలను సంప్రదిస్తాం. మరిన్ని ఆహార ఉత్పత్తుల ప్లాంటు ఏర్పాటుచేస్తాం.

- డాక్టర్ జి. సృజన, కలెక్టర్, కర్నూలు

### 100 యూనిట్లతో సత్ఫలితాలు..

పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలం తడకనపల్లిలో 70 యూనిట్లు, కోడుమూరు పరిధిలోని గూడూరులో 10, ఇతర ప్రాంతాల్లో మరో 20 ఏర్పాటు చేశారు. మూణ్నెల్లలో ఐదువేల యూనిట్లు ఏర్పాటు చేయనున్నాయి. దీనికి పొదుపు మహిళలను గుర్తించారు. ఉల్లి అధికంగా పండించే ప్రాంతాలైన పత్తికొండ, సి. బెళగల్, కోడుమూరు, కర్నూలు, గోనెగండ్ల, కోసిగి, దేవనకొండ, వెల్దుర్తి, మద్దికెర, ఆదోని ప్రాంతాలను ప్రాధాన్యతగా తీసుకున్నారు. ఉల్లి ధర తక్కువగా ఉన్నపుడు ప్రాసెస్ చేసి ఎగుమతి చేయొచ్చు. రైతు దగ్గర కంపెనీ ఉల్లి కొనుగోలు చేసి ప్లాంట్ల నిర్వాహకులకు ఇస్తుంది. కాబట్టి రైతుకు గిట్టుబాటు అవుతుంది. సోలార్ డ్రైయర్స్ ఏర్పాటుతో ఉల్లి అవసరం కూడా పెరుగుతుంది. దీంతో ధర కూడా నిలకడగానే ఉంటుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏటా 35వేల హెక్టార్లలో ఉల్లి సాగవుతోంది. హెక్టార్‌కు 60 క్వింటాళ్ల చొప్పున 21 లక్షల క్వింటాళ్ల ఉత్పత్తి వస్తుంది. ఈ క్రమంలో.. ఈ ఏడాది ఉల్లి, టమాటా సాగు మరింత పెంచాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ధర, నాణ్యత తక్కువగా ఉన్నా పారబోసే అవసరంలేకుండా 'సోలార్ డ్రైయర్స్'కు వినియోగిస్తారు. ఆదాయం కూడా ఎక్కువగా ఉండటంతో ప్లాంట్ల ఏర్పాటును ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోంది.

## జగనన్న సురక్ష సర్వీస్ వినతులు పరిష్కరించండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: జగనన్న సురక్ష సర్వీస్ వినతులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టరుతో పాటు డీఆర్‌ఓ పుల్లయ్య తదితర జిల్లాధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం ఆడిట్‌లో ప్రజల సంతృప్తి స్థాయికి సంబంధించి గుర్తించిన అంశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిశీలించాలన్నారు. పాణ్యం, గడివేముల, శ్రీశైలం తదితర మండలాల్లో పెండింగ్‌లో ఉన్న ఈకేవైసీని పూర్తి చేయాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన పనులు పూర్తి చేయడంతో పాటు ఇంకా ప్రారంభించని పనులు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనలో వచ్చిన 215 దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, డీపీఓ మంజులవాణి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**వినతుల్లో కొన్ని..**

- చాగలమర్రి మండలం ముత్యాలపాడు గ్రామంలో చంద్రశేఖర్‌కు చెందిన భూమిని 2021 సెప్టెంబర్ 13న కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని, కానీ ఆన్‌లైన్‌లో అడంగల్, పాస్‌బుక్ ఇవ్వనందున గ్రామంలోని కొందరు వ్యక్తులు ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు బెదిరిస్తున్నారని, విచారించి న్యాయం చేయాలని అదే గ్రామానికి చెందిన బి.అరుణమ్మ అర్జీ అందజేశారు.
- తన భర్త లారీ ప్రమాదంలో మరణించాడని, వైఎస్ఆర్ బీమా పథకం కింద రావాల్సిన పరిహారం ఇప్పటి వరకు బ్యాంకులో జమ కాలేదని, సచివాలయంలో అడిగితే అమౌంట్ చూపడం లేదంటున్నారని, న్యాయం చేసి ఆదుకోవాలని బేతంచెర్ల మండలం గోర్లగుట్ట గ్రామానికి చెందిన హుసేన్‌బీ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.
- పదో తరగతి పాణ్యం మండలం సుగాలిమెట్ట గ్రామ సమీపంలోని కేజీబీవీలో పూర్తి చేశానని, అక్కడే ఇంటర్ బైపీసీ చదివేందుకు సీటు ఇప్పించాలని కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలానికి చెందిన అఖిల అనే విద్యార్థి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

## ఎల్లెల్సీ వంతెన పనులు వేగవంతం చేయాలి

- ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించిన ఈఎన్‌సీ

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం మోకా సమీపంలో బరదనహళ్లి వద్ద వేదావతి(హగరి) నదిపై తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) వంతెన పిల్లర్ల నిర్మాణ పనులను ఏపీ ఈఎన్‌సీ(ప్రాజెక్ట్స్), టీబీ బోర్డు మెంబరు సీ. నారాయణరెడ్డి సోమవారం పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా గతేడాది ఈ వంతెనకు సంబంధించిన 9, 10 పిల్లర్లు దెబ్బతినగా, 15వ పిల్లర్ కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో కాలువకు నీటి సరఫరా నిలిపివేయడంతో వంతెన మరమ్మతులు చేపట్టారు. ఈ నెలాఖరు లేదంటే ఆగస్టు మొదటి వారంలో కాలువకు నీరు విడుదల చేసే అవకాశాలుండడంతో సోమవారం పనులను ఈఎన్‌సీ పరిశీలించారు. వేదావతి నదికి వరద రాక ముందే పనులు ముగించాలని ఆదేశించారు. ఈఎన్‌సీ వెంట సీఈ కబీర్‌సాబ్, కర్నూలు ఇరిగేషన్ ఎస్‌ఈ రెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీబీ బోర్డు ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఈఎన్‌సీ నారాయణరెడ్డి

### ఎస్‌డబ్ల్యూ ఇన్‌చార్జ్ డీడీగా ఎస్‌పీఎస్‌ఎన్ రెడ్డి

కర్నూలు(అర్బన్): జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారిగా కుడా వైస్ చైర్మన్ ఎస్‌పీఎస్‌ఎన్ రెడ్డికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ డా.జీ సృజన సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జే రంగలక్ష్మీదేవి ఈ నెల 25 నుంచి ఆగస్టు 24 వరకు వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలోనే ఎస్‌పీఎస్‌ఎన్ రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా ... పర్ల వసతి గృహ సంక్షేమాధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్యాంసుందర్‌కు ప్రభుత్వం సహాయ సంక్షేమాధికారిగా పదోన్నతి కల్పించి తిరుపతికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో గూడూరు హెచ్‌డబ్ల్యూఓ వలీకి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

## వాహన సేవ.. బాగు బాగు


- శ్రీశైల క్షేత్రంలో ఐదు బ్యాటరీ వాహనాలు
- వృద్ధులు, వికలాంగులకు ఉచిత ప్రయాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు



ఉచిత బ్యాటరీ వాహనంలో భక్తుల ప్రయాణం

శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసంగా విరాజిల్లుతున్న శ్రీశైల క్షేత్రంలో అందుబాటులోకి వచ్చిన ఉచిత బ్యాటరీ వాహనాలు భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా మారాయి. శ్రీశైలానికి రోజూ వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. రద్దీ దృష్ట్యా వాహనాలు ఆలయ ప్రధాన వీధుల్లోకి అనుమతించడం లేదు. దీంతో వికలాంగులు, వృద్ధులు, చంటి పిల్లల తల్లులు స్వామి,అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్ల వద్దకు నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ క్రమంలో దేవస్థానం ఏర్పాటు చేసిన బ్యాటరీ వాహన సౌకర్యంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేవస్థాన పాలక మండలి సభ్యురాలు డాక్టర్ కనకదుర్గ–1, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా–1, యూనియన్ బ్యాంక్–2, తాడేపల్లికి చెందిన దాత–1 ఇలా మొత్తం 5 బ్యాటరీ వాహనాలు దేవస్థానానికి సమకూరాయి. దాతల సమర్పించిన వీటిని భక్తుల సౌకర్యార్థం అందుబాటులోకి తెచ్చింది. నందిసర్కిల్, గంగాధర మండపం, ఉచిత క్యూలైన్, శీఘ్ర, అతిశీఘ్ర క్యూలైన్, ఆర్జితసేవల క్యూలైన్, అన్నదాన భవనం, లడ్డూ కౌంటర్, దర్శనం అనంతరం నందిసర్కిల్ వరకు 5 బ్యాటరీ వాహనాలతో భక్తులకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తోంది. రోజూ ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ సేవ కొనసాగుతుంది. వాహన డ్రైవర్లు భక్తులకు ఉచిత ప్రయాణ సేవ గురించి అవగాహన కల్పిస్తూ ఉచితంగా వారు సూచించిన ప్రాంతాలకు వాహనంలో తరలిస్తున్నారు. నడవలేని వృద్ధులు, వికలాంగుల కోసం వారు బస చేసిన సత్రం వరకు కూడా ఈ బ్యాటరీ వాహనాల్లో తరలిస్తున్నారు.

### మరో ఐదు వాహనాలు ఏర్పాటు చేస్తాం



భక్తుల సౌకర్యార్థం అదనంగా మరో 5 వాహనాలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. మరో రెండు ఉచిత బస్సులను కూడా ఏర్పాటు చేస్తాం. ఉచిత బస్సుల్లో కూడా భక్తులు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ సౌకర్యాన్ని త్వరలో ప్రారంభిస్తాం.

- ఎస్.లవన్న, ఈఓ, శ్రీశైల దేవస్థానం

### వృద్ధులకు ఎంతో ఉపయోగం



నా వయస్సు 80 సంవత్సరాలు. శ్రీశైల మల్లన్నను దర్శించుకుందామని క్షేత్రానికి వచ్చాను. అయితే క్యూలైన్ వద్దకు నడవలేని పరిస్థితి నాది. కానీ దేవస్థానం కల్పించిన ఉచిత బ్యాటరీ వాహన సౌకర్యం ద్వారా దర్శనానికి వెళ్లి, తిరిగి వచ్చేటప్పుడు కూడా బ్యాటరీ వాహనంలో వచ్చాను. నాలాంటి వృద్ధులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

- లక్ష్మీకాంతమ్మ, ఒంగోలు

### బస చేసిన సత్రం వద్ద వదిలారు



ఏటా నేను శ్రీశైల మల్లన్న దర్శనార్థం కుటుంబీకులతో వస్తుంటా. క్యూలైన్ వరకు నడిచేందుకు చాలా అవస్థలు పడాల్సి వచ్చేది. ఈ సారి మాత్రం ఆ సమస్య లేదు. బ్యాటరీ వాహనంలో వెళ్లి దర్శనం చేసుకుని తిరిగి వచ్చా. మేము బస చేసిన సత్రం నుంచి దేవస్థానం ఉచిత బ్యాటరీ సౌకర్యాన్ని ప్రవేశపెట్టడం చాలా ఆనందంగా ఉంది.

- వెంకటేశ్వరమ్మ, కొండేపి

## క్లుప్తంగా

### ఏపీ టూరిజం రెస్టారెంట్లకు ఆగస్టు 11న బహిరంగ వేలం

కర్నూలు కల్చరల్: ఏపీ టూరిజం రెస్టారెంట్ల నిర్వహణకు ఆగస్టు 11వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఏపీ పర్యాటక, సాంస్కృతిక శాఖ అధికారిణి విజయ ఒక ప్రకటనలో తెలిపారు. కేతవరం వద్ద నిర్మించిన రెస్టారెంట్‌ను 15 సంవత్సరాలు, ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం వద్ద నిర్మించిన ఏపీ టూరిజం రెస్టారెంట్ 33 సంవత్సరాల కాలపరిమితితో లీజుకు ఇచ్చేందుకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 11వ తేదీ ఉదయం 11.30 గంటలకు కలెక్టరేట్‌లోని ఏపీ టూరిజం అథారిటీ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. లీజుకు తీసుకున్న వారు ప్రస్తుతం నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన రెస్టారెంట్ నిర్మాణం పూర్తి చేసి, అభివృద్ధి చేసి పర్యాటకులకు వసతులు ఏర్పాటు చేసి నిర్వహించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనువారు రూ.10,000 డిమాండ్ డ్రాఫ్ట్‌ను డిస్ట్రిక్ట్ కలెక్టర్ అండ్ ఛైర్మన్, డిస్ట్రిక్ట్ టూరిజం కౌన్సిల్, కర్నూలు పేరిట ధరావత్తును చెల్లించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8247704152, 6309942034 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

### పరీక్ష తేదీ మార్పు

కర్నూలు (న్యూసిటీ): విద్యార్థి సంఘాలు మంగళవారం విద్యాసంస్థల బంద్‌కు పిలుపు ఇవ్వడంతో ఆ రోజు జరగాల్సిన 4, 6 డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను ఆగస్టు 8వ తేదీకి మార్పు చేసినట్లు వైస్ చాన్సలర్ ఆచార్య ఎ.ఆనందరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మిగతా పరీక్షలు ముందు ప్రకటించిన ప్రకారం యథాతథంగా జరుగుతాయని చెప్పారు. సోమవారం జరిగిన డిగ్రీ 4వ సెమిస్టర్ పరీక్షలకు 11,836 మంది విద్యార్థులకు గాను 108,21 మంది, 6వ సెమిస్టర్ పరీక్షలకు 5,923 మంది గాను 5,570 మంది హాజరయ్యారని వీసీ ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు.

### ఏడుగురు యువకులపై పోక్సో కేసు

ఆళ్లగడ్డ: బాలిక కిడ్నాప్ చేసిన కేసులో ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ఏడుగురు యువకులపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి సోమవారం తెలిపారు. పట్టణానికి చెందిన బాలికకు గత నెల 26వ తేదీ అబ్జాన్ మాయ మాటలు చెప్పి అపహరించుకు పోవడంతో పాటు అత్యాచారం చేశాడు. ఈ మేరకు బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అబ్జాన్‌తో పాటు అతనికి సహకరించిన ఆరుగురు స్నేహితులపై కేసు నమోదు చేశామని, బాలికను వైద్యశాలకు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

### వ్యక్తి ఆత్మహత్య

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో అప్పుల బాధతో ఓ వ్యక్తి సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బోయ బాలు(39) తనకు ఉన్న 1.50 ఎకరం పొలంతో పాటు మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. మూడేళ్లలో పెట్టుబడుల కోసం రూ. 10 లక్షల దాకా అప్పు చేశాడు. పెట్టుబడులు రాకపోవడంతో అప్పులు తీర్చే మార్గం లేక ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య రాములమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎంవీ రమణ తెలిపారు.

### సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు ప్రారంభం

కర్నూలు కల్చరల్: కర్నూలు ప్రభుత్వ శారద సంగీత, నృత్య కళాశాలలో సోమవారం సర్టిఫికెట్ కోర్సు థియరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సర్టిఫికెట్ కోర్సు పరీక్ష గాత్రం కోర్సుకు 30, కూచిపూడి నృత్యంకు 12, నాదస్వరంకు 11, వయొలిన్‌కు 8, మృదంగంకు 2, డోలుకు 4 మొత్తం 67 మంది విద్యార్థులు హాజరయ్యారు.

# ‘దృష్టి’ సారించి.. వెలుగులు పంచి!

- ముఖ్యమంత్రి ఈ‘ఐ’ కేంద్రాలకు ఆదరణ
- ఉమ్మడి జిల్లాలో 11 సీహెచ్‌సీలలో ఉచిత కంటి పరీక్షలు
- ఇప్పటి వరకు 2,36,616 మందికి పరీక్షలు
- 2,07,101 మందికి ఉచితంగా అద్దాల అందజేత
- 59,724 మందికి ఆపరేషన్లు



కంటిపరీక్షలు నిర్వహించేందుకు ముఖ్యమంత్రి ఈ‘ఐ’కేంద్రంలో ఉన్న ఆధునిక యంత్రాలు



పేషెంట్లకు కంటిచూపు పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాల్మిక్ అసిస్టెంటు రామకృష్ణ

జూపాడుబంగ్లా: సర్వేంద్రియానం నయనం ప్రధానం అంటారు. అలాంటి కళ్లను కాపాడుకోవటం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రైవేటు ఆసుపత్రి, క్లీనిక్‌లలో కంటి పరీక్షలు చేయించుకోవాలంటే డాక్టర్ ఫీజు, ఆపై కంటి అద్దాల కొనుగోలు.. ఇలా దాదాపు మూడు వేల రూపాయలు వెచ్చించాల్సిందే. ఆపరేషన్లు అవసరమైతే మరింత భారం కావడంతో పేదలు కంటి చూపును నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ క్రమంలో పేదలపై ప్రభుత్వం ‘దృష్టి’ సారించింది. వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా నిరంతరంగా సీహెచ్‌సీలలో ముఖ్యమంత్రి ‘ఐ’ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల చూపును కాపాడుతోంది. ఉమ్మడి జిల్లాలో ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బనగానపల్లె, పాణ్యం, నందికొట్కూరు, డోన్, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ ప్రాంతాల్లోని కమ్యూనిటీ హెల్త్ కేంద్రాలతో పాటు (సీహెచ్‌సీలు), కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముఖ్యమంత్రి ఈ‘ఐ’ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ కంటి పరీక్షలు నిర్వహించి చూపు మందగించిన వారికి ఉచితంగా నాణ్యమైన కంటి అద్దాలు అందజేస్తున్నారు. కళ్లల్లో శుక్లాలున్న వారికి ఫండస్ ఎక్విప్‌మెంటు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 2,36,616 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. వారిలో 2,07,101 మందికి ఉచితంగా నాణ్యమైన అద్దాలు అందజేశారు. 59,724 మందికి శుక్ల పరీక్షలు చేయించి వారికి ఉచితంగా కళ్లకు శస్త్రచికిత్సలు చేయించటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నందికొట్కూరు సీఎం ఈ‘ఐ’ కేంద్రంలో 2018 నుంచి ఇప్పటిదాకా 29,470 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 27,687 మందికి కళ్లజోడు పంపిణీ చేశారు. 1,783 మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించారు.

#### ఆధార్‌కార్డుంటే చాలు..

ముఖ్యమంత్రి ఈ‘ఐ’ కేంద్రాల్లో ఆధార్‌కార్డు తీసుకెళ్తే చాలు వారికి అన్నిరకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించి అద్దాలు అందజేస్తారు. ఆధార్, సెల్ నంబర్‌ను అనుసంధానించి వారికి చేసిన పరీక్షల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చుతారు. వారంలోగా పేషెంటుకు కళ్లజోడు మంజూరైనట్లు మెసేజ్ వస్తే కేంద్రం వద్దకు వెళ్లి ఉచితంగా మంజూరైన అద్దాలను తీసుకోవచ్చు. అద్దాలు ఇచ్చిన 15 రోజుల్లోగా అద్దాలు డ్యామేజీ అయినా, కళ్లజోడు విరిగిపోయినా, ఏదేని సమస్య వచ్చినా వెంటనే వాటి స్థానంలో నూతన కళ్లజోడును ఉచితంగా అందజేస్తారు.

#### పరీక్షలు ఇలా..

ఆరేళ్ల వయస్సు నుంచి 60 ఏళ్లు పైబడిన వారందరికీ సీఎం ఈ‘ఐ’ కేంద్రాల్లో కంటి పరీక్షలు చేసి శుక్లాల పనితీరును నిర్ధారిస్తారు. అలాగే డయాబెటిక్, రెటినోపతి, హైపర్‌టెన్సిల్, గ్లూకోమో, పరీక్షలతో పాటు మ్యానువల్‌గా పరీక్షలు నిర్వహించి వారి చూపు(సైట్)ను నిర్ధారిస్తారు. వారి చూపు మెరుగుపడేందుకు అవసరమైన కంటి అద్దాలను ఉచితంగా అందజేస్తారు. ఈ పరీక్షలన్ని బయట వైద్యుల వద్ద చేయించుకోవాలంటే కనీసం రూ.2వేల నుంచి రూ.5వేల దాకా ఖర్చుఅవుతుంది. కంటి శుక్లాలు దెబ్బతిన్న వారికి ఎమ్మిగనూరు, కర్నూలు, నంద్యాల, ఏరియా ఆసుపత్రులతో పాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా కళ్లకు శస్త్రచికిత్సలు చేయిస్తున్నారు.

#### ఏడాదికో కళ్లజోడు..

వైద్యుల కంటిపరీక్షల అనంతరం మంజూరు చేసిన కళ్లజోడును కేవలం ఏడాది వరకు మాత్రమే వినియోగించాలి. ఏడాది తర్వాత మరలా కంటిపరీక్షలు చేయించుకొని కళ్లజోడు పొందవచ్చు. విషయం తెలియని కొంత మంది ప్రైవేటు వైద్యులను ఆశ్రయించి జేబులు ఖాళీ చేసుకొంటున్నారు. ముఖ్యమంత్రి ఈ‘ఐ’ కేంద్రాల్లో ఏడాది నుంచి 18 ఏళ్లలోపు వయస్సున్న వారికి సంవత్సరానికి రెండు పర్యాయాలు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేస్తారు. గతంలో 60 ఏళ్లు నిండిన వృద్ధులకు ఏడాది రెండు మార్లు (ఆరు మాసాలకో పర్యాయం) చొప్పున కంటి అద్దాలు ఇచ్చేవారు. ప్రస్తుతం అందరితో పాటు వారికి ఏడాదికో పర్యాయం ఇస్తున్నారు. ఏడాది అనంతరం ప్రైవేటు వైద్యుల వద్దకు వెళ్లకుండా ఆధార్‌కార్డు తీసుకొని ముఖ్యమంత్రి ఈ‘ఐ’ కేంద్రం వద్దకు వెళ్తే చాలు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా నూతన కళ్లజోడును మంజూరు చేస్తారు.

#### చూపు బాగా కనిపిస్తోంది



నాకు కంటిచూపు సరిగ్గా కనపడకపోవటంతో ఆసుపత్రికి వచ్చి ఆధార్‌కార్డు చూపించాను. సారొళ్లు ఉచితంగా కళ్లకు పరీక్ష చేసి అద్దాలు ఇచ్చారు. ఇప్పటి దాకా నేను రెండుమార్లు కళ్లపరీక్షలు చేయించుకొని అద్దాలు తీసుకొన్నాను. ఆసుపత్రిలో ఇచ్చిన అద్దాలు చాలా బాగుంటాయి. అద్దాలు పెట్టుకొంటే కంటిచూపు బాగా కనిపిస్తుంది.

– అంబమ్మ, నందికొట్కూరు

#### సద్వినియోగం చేసుకోండి



జిల్లా వ్యాప్తంగా ఉన్న 11 ముఖ్యమంత్రి ఈ‘ఐ’ కేంద్రాల్లో సెలవుదినాల్లో మినహా ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తాం. మధ్యాహ్నం నుంచి కంటి అద్దాలు పంపిణీ చేస్తాం. కేంద్రాల్లో ఉన్న ఆధునిక యంత్రాలతో పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన అద్దాలను ఉచితంగా అందజేస్తాం.

– శివప్రసాద్, ఈ‘ఐ’కేంద్రాల జిల్లా కోఆర్డినేటర్

# క్లస్టర్ల ఏర్పాటులో లోపించిన పారదర్శకత

కర్నూలు(అర్బన్): పరిపాలనా సౌలభ్యంలో భాగంగా ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ సంక్షేమ శాఖల్లో ఏర్పాటు చేస్తున్న క్లస్టర్లలో పారదర్శకత లోపించిందని కర్నూలు సహాయ సంక్షేమాధికారి బీ మద్దిలేటి ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు రూపొందించిన క్లస్టర్ల ఏర్పాటు వల్ల ప్రభుత్వ ఉద్దేశం నెరవేరదనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. మూడు మండలాలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. అందులో భాగంగా కర్నూలు, ఓర్వకల్లు, క్రిష్ణగిరి మండలాలను ఒక క్లస్టర్‌గా పెట్టారన్నారు. కర్నూలు ఏఎస్‌డబ్ల్యూఓ పరిధికి అతి సమీపంలో ఉన్న కల్లూరు మండలాన్ని 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోడుమూరు నియోజకవర్గంలోకి, అలాగే 60 కిలోమీటర్ల దూరంలోని కృష్ణగిరి మండలాన్ని కర్నూలు ఏఎస్‌డబ్ల్యూఓ పరిధిలోకి చేర్చారని తెలిపారు. ఈ ప్రక్రియతో ప్రభుత్వం ఉద్దేశం నెరవేరదన్నారు. పరిపాలనా సౌలభ్యంలో భాగంగా కల్లూరు మండలాన్ని కర్నూలు ఏఎస్‌డబ్ల్యూఓ పరిధిలోకి తీసుకురావాలన్నారు.



ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని కలిసిన సహాయ సంక్షేమాధికారులు

#### క్లస్టర్ల ఏర్పాటుపై కలెక్టర్‌కు లేఖ

సంక్షేమ శాఖలో ఏర్పాటు చేస్తున్న క్లస్టర్లు పారదర్శకంగా ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి లేఖ రాశారు. కర్నూలు, ఓర్వకల్లు, కల్లూరు మండలాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి పాలన సౌకర్యవంతంగా ఉండేలా చూడాలన్నారు.

# భారత్ వైఫై డిస్ట్రిబ్యూటర్ కనెక్షన్ పేరుతో మోసం

- స్పందనలో ఎస్పీకి బాధితుడి ఫిర్యాదు

కర్నూలు: భారత్ వైఫై డిస్ట్రిబ్యూటర్ కనెక్షన్ ఇస్తామని చెప్పి కర్నూలులోని దేవనగర్‌కు చెందిన కదమూరు గౌతమ్ అడ్వాన్స్ కింద రూ.25 వేలు తీసుకుని మోసం చేశాడని నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా గ్రామానికి చెందిన సావేరా బీ ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో జూపాడు బంగ్లా ఎస్‌ఐ కూడా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, మోసం చేసిన వ్యక్తి కర్నూలుకు చెందిన వాడైనందున విచారణ జరిపి న్యాయం చేయాలని ఎస్పీకి ఇచ్చిన వినతిపత్రంలో ఆమె కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి, వారితో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందనకు మొత్తం 102 ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటానని ఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు కూడా స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు.



స్పందనలో ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేస్తున్న మహిళ

#### స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- ఇంటిని కొడుకు, కోడలు వారి పేరు మీద రాసి ఇవ్వాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని కల్లూరు ఎస్టేట్‌కు చెందిన తిరుపతయ్య ఫిర్యాదు చేశారు.
- బార్బర్ షాప్‌నకు షేవింగ్ ట్రిమ్మర్లు ఇస్తామని డబ్బులు తీసుకుని బెంగళూరుకు చెందిన మయూర్ మార్కెటింగ్ యజమాని భరత్ సోలంకి మోసం చేశాడని కర్నూలు వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన శివకుమార్ ఫిర్యాదు చేశారు.
- తనకున్న ఐదు ఎకరాల పొలంలో అర ఎకరా పొలాన్ని పక్కన్న ఉన్న ఒక వ్యక్తి ఆక్రమించుకున్నారని, విచారణ జరిపి న్యాయం చేయాలని మద్దికెర మండలం హంపా గ్రామానికి చెందిన హరిత ఫిర్యాదు చేశారు.
- ముంబాయికి చెందిన వ్యక్తి ఆన్‌లైన్‌లో కెపె3 మైనింగ్ మిషన్ ఇస్తామని, ఆఫర్ ఉందని, దాని వల్ల ఆదాయం వస్తుందని, రూ.5.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలుకు చెందిన ఇలియాజ్ ఫిర్యాదు చేశారు.
- హైదరాబాదు-కర్నూలు జాతీయ రహదారి పక్కన మునగాలపాడు గ్రామ సమీపంలో ఉన్న పొలాన్ని సునిల్, రామకృష్ణ, మహేష్ అనే వ్యక్తులు లీజుకు తీసుకుని దానిని కొన్నట్లు రిజిస్టర్ చేయించుకుని మోసం చేశాడని మామిదాలపాడు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ చౌదరి ఫిర్యాదు చేశారు.

# భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

ఎమ్మిగనూరురూరల్/ మంత్రాలయం రూరల్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ జయరాంనాయుడు తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో పట్టుబడిన మద్యం, స్కార్పియో వాహనాన్ని మీడియాకు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం అర్ధరాత్రి మంత్రాలయం మండలం మాలపల్లి క్రాస్ రోడ్డు దగ్గర సెబ్ పోలీసులు తనిఖీలు చేస్తున్నారన్నారు. సెబ్ పోలీసులను చూసి రాయచూర్ వైపు నుంచి వస్తున్న స్కార్పియో వాహనాన్ని ఆపి డ్రైవర్ పారిపోయాడని తెలిపారు. వాహనాన్ని తనిఖీ చేయగా 20 బాక్సుల్లో 1920 (90ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లు కనిపించాయని, వాటిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. స్కార్పియో వాహనానికి బస్సు నంబర్ ప్లేట్ పెట్టుకొని తరలిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. పట్టుబడిన కర్ణాటక మద్యం విలువ మార్కెట్లో రూ. లక్ష ఉంటుందని తెలిపారు. సెబ్ ఎస్‌ఐ సోమశేఖర్‌రావు, హెచ్‌సీలు గోపాల్, లింగప్రసాద్, చంద్రమౌళి, గౌస్, రబ్బానీ, కానిస్టేబుల్స్, నరసింహారెడ్డి, రామచంద్రుడు, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన మద్యం, స్కార్పియో వాహనాన్ని చూపుతున్న సీఐ జయరాంనాయుడు, పోలీసులు

#### హెబ్బటం గ్రామంలో..

హొళగుంద: హెబ్బటం గ్రామంలో కర్ణాటక మద్యం ప్యాకెట్లు విక్రయిస్తున్న పిన్నే ఈరప్ప అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు విలేకరులకు తెలిపారు. అతని నుంచి 23 బాక్సులోని 2,208 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్ల ఒరిజినల్ చాయిస్ (90ఎంఎల్), రెండు బాక్స్‌లోని 96 ప్యాకెట్లు, 8పిఎం విస్కీ(180 ఎంఎల్) ప్యాకెట్లు, 24 టిన్‌బీర్ల ఒక బాక్స్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

# ఉపాధ్యాయుల పని సర్దుబాటుపై వివాదం

- ఉత్తర్వులు తాత్కాలికంగా నిలిపివేసిన విద్యాశాఖ అధికారులు

కర్నూలు సిటీ: ఉపాధ్యాయులుకు ఇచ్చిన పని సర్దుబాటు ఉత్తర్వులు దుమారం రేపాయి. మండల పరిధిలో కానీ, డివిజన్ పరిధిలో కాకుండా జిల్లా స్థాయిలో ఉత్తర్వులు ఇవ్వడం వివాదానికి కారణమైంది. ఈ విషయంపై జిల్లాలోని ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో పని సర్దుబాటు ఉత్తర్వులు తాత్కాలికంగా నిలిపి వేశారు. ప్రజాప్రతినిధుల సూచనలను పాటిస్తూ ఉత్తర్వులను మార్పులు చేసి మండల, డివిజన్ పరిధిలోనే సర్దుబాటు చేయాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయం తీసుకొన్నారు. ఆదోని డివిజన్‌లోని స్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. ఇటీవల జిల్లాలో పర్యటించిన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఈ విషయాన్ని గుర్తించారు. టీచర్ల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలో వివిధ సబ్జెక్టుల టీచర్లు 98 మంది అదనంగా ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించారు. వీరిని ఆదోని డివిజన్ పరిధిలోని హైస్కూళ్లలో సర్దుబాటు చేశారు. మండలాలు, డివిజన్ పరిధిలో కాకుండా జిల్లా పరిధిలో సర్దుబాటు చేయడం వివాదానికి కారణమైంది. దీంతో విద్యాశాఖ అధికారులు దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు.

# కారు కేసులో కదలిక

డోన్ టౌన్: నెల రోజులుగా పట్టణంలో చర్చనీయాంశంగా మారిన కారు ఘటనకు సంబంధించి ఎట్టకేలకు కేసు నమోదైంది. కర్నూలు – బెంగళూరు జాతీయ రహదారిపై గత నెల 29వ తేదీన కారు అపహరణ సంఘటనకు సంబంధించి సోమవారం మహారాష్ట్ర గంగాబాయ్ హట్‌కు చెందిన కారు డ్రైవర్ రణీట్ డోన్‌కు చేరుకుని కారు అపహరణ, డ్రైవర్ల కిడ్నాప్ కేసుగా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మహారాష్ట్ర నాగపూర్ నుంచి ఓ యజమాని కారును బెంగళూరులో ఇచ్చేందుకు గంగాబాయ్ హట్‌కు చెందిన కారు డ్రైవర్లు రణీట్, సామెల్ జూన్ 28వ తేదీ బయలు దేరారు. మరుసటి రోజు 29న మార్గమధ్యలో డోన్ పట్టణ సమీపంలోని జాతీయ రహదారి దొరపల్లె బ్రిడ్జి సమీపంలో మూత్ర విసర్జన కోసం ఆపగా నలుగురు వ్యక్తులు కారులో వచ్చి వీరి కారును చుట్టుముట్టారు. రణీట్, సామెల్ ముఖాలపై బట్ట పెట్టగా స్పృహ తప్పి పడిపోయారు. ఆ తర్వాత కర్ణాకట సరిహద్దులో వదిలి వెళ్లడంతో వారు సొంతూరుకు చేరుకున్నారు. కాగా వీరి కారు ఆత్మకూరు సమీపంలో నల్లకాల్వ వద్ద దుండగులు వదిలి వెళ్లడంతో పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. నెల రోజులుగా కారు యజమాని రాకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ కారులో హవాలా డబ్బులు రూ. 4 కోట్లు కారులో తరలిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు దోపిడీకి పాల్పడినట్లు తెలుస్తోంది.



# పశుసంరక్షణకు భరోసా!

- అగ్రిల్యాబ్‌లో పశు వ్యాధుల నిర్ధారణ
- రోగాల నివారణకు మందుల అందజేత
- ఉమ్మడి జిల్లాలో 14 ల్యాబ్‌ల ఏర్పాటు
- ఒక్కో ల్యాబ్‌లో ప్రతి నెలా 180 పరీక్షల నిర్వహణ

కోవెలకుంట్ల: పాడి రైతుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. పశుపోషణకు భరోసా కల్పిస్తూ అగ్రిల్యాబ్‌లో మరో విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో పశువులకు సంక్రమించే వ్యాధులను నిర్ధారిస్తూ, వాటి నివారణకు చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో చాలా మంది రైతులు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమ నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వ్యాధులు సంక్రమించిన సమయంలో విలువైన పశు సంపదను కోల్పోతున్నారు. రైతులు నష్టపోకుండా ప్రతి నియోజకవర్గంలో పశువులకు సోకే వ్యాధులు నిర్ధారణకు ప్రయోగశాలలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఒక్కో నియోజకవర్గంలో రూ. 57 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ అగ్రిల్యాబ్‌ల్లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసింది. ప్రతి ల్యాబ్‌లో పశుసంవర్ధశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పర్యవేక్షణలో ల్యాబ్ టెక్నీషియన్లు ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. అయా నియోజకవర్గాలోని అన్ని పశువైద్యశాలల నుంచి అందే వ్యాధుల నమూనాలపై ప్రయోగాలు చేసి నివేదికలు అయా నియోజకవర్గ ఏడీలకు అందజేస్తున్నారు. సకాలంలో పశువులకు సోకే వ్యాధులను గుర్తించి మందులను అందజేస్తుండటంతో మరణాల తగ్గి పశు సంపద వృద్ధి చెందుతోంది.

#### నెలలో 180 పరీక్షలు

ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో మొత్తం 14 నియోజవర్గాల్లో 14 ల్యాబ్‌లు ఉన్నాయి. ఇవి 2021 జూన్ 8న అందుబాటులోకి వచ్చాయి. ఇందులో 11 అగ్రిల్యాబ్‌లకు సొంత భవనాలు ఉండగా.. మరో రెండు అద్దె భవనంలో నడుస్తున్నాయి. ఆ రెండు భవనాలు సైతం పూర్తికావడంతో త్వరలో ప్రారంభించనున్నారు. అగ్రిల్యాబ్‌లోని విభాగంగా పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, తదితరాలకు సంక్రమించే వ్యాధులపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతి ల్యాబ్‌లో నెలకు 180 చొప్పున పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ప్రతి నెలా లక్ష్యం మేరకు పరీక్షలు చేస్తున్నారు. పశువుల మూత్రం, పేడ, చర్మ సమస్యలకు సంబంధించిన నమూనాలను ప్రయోగశాలల్లో పరీక్షించి వ్యాధి లక్షణాలు గురిస్తున్నారు. వీటితోపాటు పశువులకు పల ర కాల టీకాలు వేశాక వాటి పనితీరు, పశువుల్లో ఏవైనా వైపరీత్యాలు సంభవిస్తే వాటిని పరిశీలించడం వంటి ప్రయోగాలు కొనసాగుతున్నాయి. అలాగే పశువుల నుంచి మనషులకు సంక్రమించే వ్యాధులను గుర్తించడం జరుగుతోంది. బ్రూసెల్(పునరుత్పత్తి లేకపోవడం) వ్యాధిని గుర్తించడం, యాంటీబయోటిక్ నిర్ధారణ పరీక్షలు, పాలు, రక్తనమూనాలు సేకరించి ఏఏ రకాల యాంటీబయోటిక్ మందులు ఇస్తే పశువుకు నయమవుతుందో గుర్తించడం, వ్యాధులబారిన పడి మృతి చెందిన పశువులకు పోస్టుమార్టం, తదితర పరీక్షలు నిర్వహిస్తున్నారు. గొర్రెలు, మేకలకు సోకే నట్టల నిర్ధారణ, నివారణకు తగిన మందులు ఇచ్చే ప్రయోగాలు కొనసాగుతున్నాయి. అలాగే కోళ్లకు సంక్రమించే వ్యాధులను సైతం ఈ ప్రయోగశాలల్లో గుర్తిస్తున్నారు. ప్రతి ఏటా ప్రయోగాలకోసం ఉపయోగించే రసాయన ద్రావణాలు, ఇతర పరికరాల కొనుగోలకు ప్రభుత్వం ఒక్కో ప్రయోగశాలకు రూ. 2 లక్షల నిధులు కేటాయిస్తోంది.



కోవెలకుంట్లలోని అగ్రిల్యాబ్



ఆలూరులోని అగ్రిల్యాబ్‌లో పశువుల రక్త పరీక్ష చేస్తున్న టెక్నీషియన్

#### ఉమ్మడి జిల్లాలో గత రెండేళ్లుగా చేసిన పరీక్షలు

| నియోజకవర్గం | ఇప్పటి వరకు చేసిన పరీక్షలు |
|---|---|
| కర్నూలు | 40,677 |
| నంద్యాల | 3,849 |
| ఆదోని | 3,360 |
| ఆలూరు | 2,410 |
| ఆత్మకూరు | 1,562 |
| ఆళ్లగడ్డ | 3,931 |
| బనగానపల్లె | 1,810 |
| డోన్ | 2,367 |
| గూడూరు | 2,110 |
| మంత్రాలయం | 1,950 |
| నందికొట్కూరు | 2,484 |
| పాణ్యం | 3,234 |
| పత్తికొండ | 3,734 |

#### రైతులకు ఉపయోగకరం



ప్రయోగశాలలు ఏర్పాటు కావడంతో పశువ్యాధులు సకాలంలో గుర్తించి మందులు అందజేస్తున్నారు. పశువుల మరణాలు తగ్గి పశు సంపద వృద్ధి చెందుతోంది. ప్రయోగశాలలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. బ్రూసెల్ అనే వ్యాధిని 2030 నాటికి అంతం చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. దీంతో ఆ వ్యాధి నివారణకు 4 నుంచి 8 నెలల వయసు పెయ్యదూడలకు టీకాలు వేయిస్తున్నాం.

– కృష్ణకుమార్, పశువైద్యాధికారి, కోవెలకుంట్ల